

శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పూజల అనంతరం మేళ తాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



శనగల బసవన్నకు పరోక్ష సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు ఆదివారం త్రయోదశి సందర్భంగా శాస్త్రోక్తంగా పరోక్ష సేవగా అర్చకులు విశేషపూజలు నిర్వహించారు.



క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు శుభవార్త

కర్నూలు ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో నిర్మిస్తున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 247 పోస్టులు మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. 8లో

న్యూస్‌రీల్

మహానందీశ్వరుడి సేవలో..



ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి దంపతులను ఆశీర్వదిస్తున్న వేదపండితుడు

మహానంది: మహానందీశ్వరుడికి ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి వి.నారసింగ్ ఆదివారం రాత్రి పూజలు నిర్వహించారు. సతీసమేతంగా వచ్చిన న్యాయమూర్తికి మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, అధికారులు స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో ఆశీర్వచనాలు చేసి స్వామివారి ప్రసాదాలు, మెమెంటో అందించారు.

నేడు 'స్పందన' రద్దు

నంద్యాల: ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ నెల 14వ తేదీ నిర్వహించాల్సిన 'జగనన్నకు చెబుదాం - స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని సోమవారం వినతులు ఇచ్చేందుకు రావద్దని సూచించారు. మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో జరిగే స్పందన కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని పేర్కొన్నారు.

పోలీసు స్పందన రద్దు

బొమ్మలసత్రం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే పోలీసు స్పందన కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో సోమవారం రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తెలిపారు. ఫిర్యాదిదారులు సుదూర ప్రాంతాల నుంచి జిల్లా ఎస్పీ కార్యాలయానికి రాకుండా వారి పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో, సీఐ, డీఎస్పీ కార్యాలయాల్లో యథావిధిగా నిర్వహించే స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు.

అన్నదాన పథకానికి విరాళం



దాతకు జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం కర్నూలుకు చెందిన విజయసారథి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని సహాయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరెడ్డికి అందజేయగా, వారు దాతలకు దేవస్థానం తరపున స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

కొండల్లో చిరుతపులుల సంచారం

ఆస్పరి/కోసిగి: కైరుప్పల, కోసిగి సమీపంలోని కొండల్లో ఆదివారం చిరుతపులులు సంచరించాయి. దీంతో ఆయా గ్రామస్తులు భయాందోళన చెందారు. వానరాల వేట కోసం ఇవి వచ్చినట్లు తెలుస్తోంది. పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు అరుపులు, కేకలు వేయడంతో కైరుప్పలలో చిరుత పులి పారి పోయింది. ఆస్పరి మండలంలోని తురువల్లు, తొగలుగల్లు, కలపరి, ములుగుందం, బిల్లేకల్లు, అట్టికల్లు గ్రామాల్లోని కొండల్లో చిరుతపులి సంచరిస్తోందని, ఫారెస్టు అధికారులు దానిని బంధించాలని గ్రామస్తులు కోరారు.

ఖరీఫ్‌కు ఊపిరి



ట్రాక్టర్‌తో పొలానికి దమ్ము చేస్తున్న రైతు

వాన జాడ లేక రైతులు ఆందోళన చెందుతున్న సమయంలో వరుణుడు కరుణించాడు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సాగు విస్తీర్ణం మందగిస్తున్న తరుణంలో జూలై నెల ద్వితీయార్థంలో జిల్లాలో సాధారణ వర్షపాతానికి మించి వర్షం కురవడంతో పొలాలు పదునయ్యాయి. రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. అదే సమయంలో సాగునీటి ప్రాజెక్టులకు జీవనాడి అయిన శ్రీశైల ప్రాజెక్టుకు భారీగా వరద జలాలు చేరడం, పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల కావడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

– నంద్యాల

- జూలై నెలలో కరుణించిన వరుణుడు
- పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- ప్రభుత్వ భరోసాతో ధీమాగా వ్యవసాయం
- ఇప్పటి వరకు 93,897 హెక్టార్లలో వివిధ పంటలు సాగు
- అందుబాటులో 60 వేల టన్నుల ఎరువులు



నంద్యాలలో పత్తి విత్తనాలు నాటుతున్న దృశ్యం

ఖరీఫ్ రైతుల ఆశలకు ఊపిరి పోస్తూ వరుణుడు వర్షించడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. సేద్యం పనులు చేసి, మరో వైపు నారుమళ్లు పోసి వాన కోసం నిరీక్షిస్తున్న రైతుల్లో ఆశలు చిగురించాయి. నంద్యాల జిల్లాలో 2.38 లక్షల హెక్టార్లలో పంటలు సాగు లక్ష్యంగా అధికారులు ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పుష్కలంగా పంటలు పండుతున్నాయి. గతేడాది వరకు సీజన్ల వారీగా రుతుపవనాలు సకాలంలో ప్రవేశిస్తూ వస్తున్నాయి. అలాగే శ్రీశైలం జలాశయానికి భారీగా నీరు వచ్చి చేరుతుండటంతో సాగునీటికి ఇబ్బంది ఏర్పడలేదు. అయితే ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో ఖరీఫ్ సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 148.2 మి.మీ కాగా కేవలం 34.7 మి.మీ వర్ష పాతం నమోదైంది. ముందస్తు వర్షాలతో అక్కడక్కగా విత్తనాలు వేసి రైతులు నష్టపోయారు. జిల్లాలో పంటల సాగు సాధారణ విస్తీర్ణం 2.38 లక్షల హెక్టార్లు కాగా ఆగస్టు మొదటి వారం వరకు 93,897 హెక్టార్లలో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. గత ఏడాది ఈ సమయానికి 1.26 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. వారం రోజులు క్రితం భారీ వర్షాలు కురవడంతో మళ్లీ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగవుతున్నాయి. ఖరీఫ్‌సీజన్ ప్రారంభమై దాదాపు 45 రోజుల తర్వాత జూలై 15 నుంచి 30 వరకు జిల్లాలో భారీ, మోస్తరు వర్షం కురిసింది. జూలై సాధారణ వర్షపాతం 163.5 మి.మీ కాగా 219.8 మి.మీ నమోదు కావడం విశేషం. ఆగస్టు మాసంలో సాధారణ వర్షపాతం నమోదైతే సాగు విస్తీర్ణం లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎక్కువగా వరి, మిరప, పత్తి, మినుము, సోయా చిక్కుడు, మొక్కజొన్న, వేరుశనగ, కంది తదితర పంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు.



గడివేముల మండలంలో బోర్ల కింద వేసిన వరి నారును తీస్తున్న కూలీలు

శ్రీశైలం జలాశయానికి వరద చేరడంతో పోతిరెడ్డిపాడు నుంచి నీరు విడుదల చేశారు. ఈ క్రమంలో కేసీ కెనాల్, తెలుగుగంగ కాల్వలకు నీళ్లు వస్తాయని రెతులు వరి సాగుకు సిద్ధమయ్యారు. కొన్ని చోట్ల ఇప్పటికే నాట్లు కూడా వేశారు. పంట పొలాలకు ఎరువులు చల్లుతూ, కలుపులు తీస్తూ మందు పిచికారీ చేస్తూ రైతులు, కూలీలు బిజీబిజీగా ఉన్నారు. పంటల సాగుకు దుక్కి దున్నే సమయం నుంచి పండించిన పంటలకు గిట్టుబాటు ధర దక్కేంత వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుండటంతో రైతులు ధీమాగా వ్యవసాయం చేస్తున్నారు.

ఎరువులు సిద్ధం..

ఖరీఫ్ సీజన్ కోసం జిల్లాలో 60,112 టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. ఇవే కాకుండా రబీ సీజన్ పూర్తయిన తర్వాత జిల్లా వ్యాప్తంగా మిగిలిన 14 వేల టన్నులు కూడా రైతులకు అందించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా గత మే నెల నుంచే ఎరువులను రైతులకు అధికారులు అందు బాటులో ఉంచారు. 15,170 మెట్రిక్ టన్నుల యూరియా, 14,084 మెట్రిక్ టన్నులు డీఏపీ, 35,065 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది ఖరీఫ్, రబీకి కలిపి 88,400 మెట్రిక్ టన్నుల ఎరువులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా అధికారులు కూడా ఎరువులను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

పెట్టుబడి సాయం రూ.120.97 కోట్లు..

వైఎస్సార్ రైతు భరోసా 2023–24 ఆర్థిక సంవత్సరానికి తొలి విడత పెట్టుబడి సాయం కింద 2,19,791 మంది రైతులకు రూ.120.97 కోట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల ఖాతాల్లో నేరుగా జూన్ 1వ తేదీన నగదు జమ చేశారు. అలాగే మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద 10,434 మందికి రూ.10,22,44,548 జమ చేశారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ

రాయితీ కింద జిల్లాలో 500 క్వింటాళ్ల కంది విత్తనాలు, 85 క్వింటాళ్ల మినుములు, 18 క్వింటాళ్ల పెసలు, 16 క్వింటాళ్ల కొర్రలు, 3,560 క్వింటాళ్ల వేరుశనగ, 3,993 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు ఇప్పటికే వ్యవసాయాధికారులు రైతులకు అందించారు. వీటితో పాటు గ్రామీణ విత్తన పథకం కింద ఐసీపీఎల్ 87119 రకం కంది 36 క్వింటాళ్లు, ఎన్‌డీఎల్ఆర్–7 వరి విత్తనం 300 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 487.5 రకం వంగడాలు ఆర్‌బీకేల ద్వారా రైతులకు పంపిణీ చేశారు.

అందుబాటులో యంత్రసేవ..

ఆర్‌బీకేల వారీగా వ్యవసాయ యంత్రాలను రైతులకు ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. జిల్లాలోని 411 ఆర్‌బీకేల ద్వారా సాగుకు అవసరమైన అన్ని రకాల యంత్రాలను రైతు సంఘాలే నిర్వహించుకునేలా చర్యలు తీసుకుంది. బ్యాంకులు, వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు విస్తృతంగా అందజేస్తుంది.

జిల్లాలో ఆయకట్టు సాగు వివరాలు (ఎకరాల్లో)

ప్రాజెక్ట్	ఆయకట్టు విస్తీర్ణం
పంచాయతీ చెరువులు	6,754
మైనర్ ఇరిగేషన్ చెరువులు	42,342
కేసీ కెనాల్	1,79,469
తెలుగుగంగ	1,24,098
ఎస్సార్బీసీ	1,23,915
మొత్తం	4,54,411

జిల్లాలో మూడు నెలలుగా వర్షపాతం వివరాలు (మి.మీలలో)

నెల	సాధారణ	కురిసింది
జూన్	148.2	34.7
జూలై	163.5	219.8
ఆగస్టు (ఇప్పటి వరకు)	139.4	19.3

ఆర్బీకేలకు చేరిన ఎరువులు



జిల్లాలో ఖరీఫ్ రైతులకు ఎరువుల కొరత ఉండదు. ఇప్పటికే 60 వేల టన్నుల ఎరువులను ఆయా ఆర్‌బీకేలకు ఇప్పటికే పంపాం. రైతులకు అవసరమైన ఎరువులను తీసుకుంటున్నారు. జిల్లాలో విత్తనాలు సైతం రాయితీతో రైతులకు పంపిణీ చేశాం. విత్తనం వేసే ముందు ఒకసారి అగ్రిటెక్ ల్యాబ్‌లో పరీక్ష చేయించుకోవడం మేలు. మార్కెట్‌లో లూజు, ధ్రువీకరణ చేయని విత్తనాలు కొనుగోలు చేయకూడదు. ఎరువులు ఎవరైనా బ్లాక్ మార్కెట్లో విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌రావు, వ్యవసాయాధికారి, నంద్యాల



ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు మువ్వన్నెల శోభను అద్దుకుంది. ఆదివారం రాత్రి లేజర్ లైటింగ్ షోతో చారిత్రక సౌధం మెరిసిపోయింది. త్రివర్ణ శోభితంతో సందర్శకులను ఆకట్టుకుంది.

–సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

నేడు హర్ ఘర్ తిరంగా

కర్నూలు(అగ్రికల్చర్): ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టనున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని జిల్లా నీటియాజమాన్య సంస్థ గ్రామ పంచాయతీల సహకారంతో చేపడుతోంది. జిల్లా నీటియాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 12 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టారు. జిల్లాలోని 484 పంచాయతీలు ఉండగా.. ప్రతి పంచాయతీలో 75 ప్రకారం మొక్కలు నాటారు. శిలాఫలకం ఆవిష్కరించడంతో పాటు వసుధకు వందనం, వీరులకు వందనం కార్యక్రమాలు చేపట్టారు.

ఆన్‌లైన్‌లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ మెటీరియల్

శ్రీశైలంప్రాజెక్ట్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఓపెన్ యూనివర్సిటీ) స్టడీ మెటీరియల్‌ను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.సీతారామారావు తెలిపారు. ఆదివారం ఆయన సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని శ్రీశైలం అధ్యయన కేంద్రాన్ని వీసీ సీతారామారావు, డైరెక్టర్ ప్రొఫెసర్ పి.మధుసూదన్‌రెడ్డి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ బానూవత్ లాల్ సందర్శించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. యూనివర్సిటీలోని యూజీసీ కోర్సుల వివరాలు, యూనివర్సిటీ మాన్యువల్‌ను ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ ఆవిష్కరించారు. అధ్యయన కేంద్రంలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. స్టడీ సెంటర్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతభత్యాల అంశాలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎస్. మహేశ్వరరెడ్డి, సిబ్బంది జాక్ ఎన్ ఏలియా, నాసరయ్య, ఎస్ సుబ్రహ్మణ్యశర్మ, జీవైవీ కల్యాణి, కె.రవి, తదితరులు పాల్గొన్నారు.



యూనివర్సిటీ మాన్యువల్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ చాన్స్‌లర్ సీతారామారావు

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో నిండిన క్యూ కంపార్ట్‌మెంట్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రెండవ శనివారం, ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే సోమవారం స్వామి కావడంతో కొందరు భక్తులు ముందుగానే శ్రీశైలం చేరుకున్నారు. ఉభయతెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తదితర రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీశైలం చేరుకున్నారు. వేకువజామున పాతాళగంగలో పుణ్యస్నానాలనంతరం భక్తులు మల్లన్న దర్శనార్థమై ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలకు చేరుకోవడంతో అన్ని క్యూ కంపార్ట్‌మెంట్లు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. స్వామి అమ్మవార్లకు నిర్వహించుకునే ఆర్జితసేవలు, వీఐపీ దర్శనం అన్ని ఒకే క్యూలైన్ ద్వారా ప్రవేశం చేయడంతో భక్తులు అవస్థలు పడ్డారు.

కేంద్ర అవార్డుకు ఆదోని రూరల్ పోలీస్‌స్టేషన్ ఎంపిక

ఆదోనిరూరల్: కేంద్ర హోంశాఖ ఇచ్చే అవార్డుకు ఆదోని రూరల్ పోలీస్‌స్టేషన్ ఎంపికైందని కేంద్ర హోంశాఖకు సంబంధించిన అగ్రి రూరల్ కన్సల్టెన్సీ అధికారి లోకేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఆదోని రూరల్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023వ సంవత్సరానికి సంబంధించి కేంద్ర హోంశాఖ ఇచ్చే అవార్డుకు దేశవ్యాప్తంగా 10 పోలీస్‌స్టేషన్‌లను ఎంపిక చేయగా, రాష్ట్ర వ్యాప్తంగా మూడు స్టేషన్‌లు జాబితాలో చోటు దక్కించుకున్నాయన్నారు. అందులో ఆదోని రూరల్ పోలీస్ స్టేషన్ ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడం, నేరాలు జరగకుండా ముందస్తు కట్టడి, నేరాలను అదుపు చేసేందుకు తీసుకున్న అంశాలను పరిశీలించిన కేంద్ర హోంశాఖ ఈ జాబితాను రూపొందించిందన్నారు. ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ గోపాల్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరుకుందలో 'శ్రావణ' సౌరభం

- 17 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- హాజరుకానున్న లక్షలాది మంది భక్తులు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

కౌతాళం: శ్రావణ మాస ఉత్సవాలకు ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి క్షేత్రం ముస్తాబవుతోంది. ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 14 వరకు వేడుకలు వైభవంగా జరుగుతాయి. ఉత్సవాల్లో సోమవారం, గురువారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ సారి నాలుగు సోమవారాలు, ఐదు గురువారాలు వచ్చాయి. మూడో సోమవారం దాదాపు 3లక్షల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారని అంచనా. నాల్గవ సోమవారం స్వామి వారి పల్లకోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాలు ముగిసే వరకు ఈ ప్రాంతం ప్రజలు మద్యపానానికి, మాంసహారానికి దూరంగా ఉంటారు. స్వామిని మనస్ఫూర్తిగా కొలిస్తే అంతా శుభమే జరుగుతుందనే నమ్మకం ఉంది.

అంచలంచెలుగా ఆలయ అభివృద్ధి

మహాయోగి ఈరన్న స్వామి నడయాడిన ప్రాంతమే ఉరుకుంద. క్రీ.శ.1610లో కర్ణాటక ప్రాంతం నుంచి ఉరుకుందకు వచ్చిన స్వామి అసలు పేరు హిరణ్య. తన 12వ ఏట ఆవులు మేపడానికి స్వామి ఇక్కడికి వచ్చినట్లు స్థలపురాణం చెబుతోంది. ఆవులు గడ్డి మేస్తున్న సమయంలో రావిచెట్టు (అశ్వత్థ వృక్షం) కింద స్వామి తపస్సు చేసుకునేవారు. తన తపోశక్తితో భక్తులకు విశేష సేవలు అందించారు. ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రం 1660లో వ్యాప్తి చెందింది. భక్తులు స్వామివారికి దేవాలయాన్ని 1768లో నిర్మించారు. ఆలయాన్ని 1995లో పునర్నిర్మించారు. మాస్టర్‌ప్లాన్ ఆధారంగా ఇక్కడ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. రూ.4.60 కోట్లతో మహా ప్రాకారం ఇప్పటికే పూర్తయ్యింది. రూ. 9.70కోట్లతో నాలుగు గోపురాల నిర్మాణ పనులు చేపట్టగా.. మూడు గోపురాలు పూర్తయ్యాయి. ముఖద్వారంలో ఉన్న 7 అంతస్తుల గోపురం నిర్మాణం చివరి దశలో ఉంది.



ఈరన్నస్వామి మూలవిరాట్

నిరాకారుడు..మహిమాన్వితుడు

స్వామికి నిర్దిష్టమైన ఆకారం అంటూ లేదు. నిరాకారుడిగా స్వామి పూజలందుకుంటున్నారు. ఆలయంలో పెద్దరావి చెట్టు ఉంది. చెట్టు చుట్టూ కట్టను నిర్మించారు. ప్రస్తుతం భక్తులు కట్టకే పూజలు చేస్తున్నారు. స్వామి ఇప్పటికీ రాత్రివేళల్లో సర్ప రూపంలో, సాధువు రూపంలో సంచరిస్తుంటాడని భక్తులు విశ్వసిస్తున్నారు. స్వామిపై విశ్వాసం ఉంచేవారికి అన్నీ శుభాలే జరుగుతాయని నమ్ముతున్నారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది.

శైవ, వైష్ణవ సంప్రదాయాలు..

ఈరన్న స్వామి వీరశైవ సంస్కృతికి వికాసానికి కృషి చేశారు. స్వామివారు శైవాచారం పాటించడంతో కొందరు భక్తులు వీరభద్ర స్వామి ప్రతిరూపంగా కొలుస్తున్నారు. స్వామి తపస్సు చేసి అశ్వత్థ వృక్షం విష్ణుమూర్తికి చిహ్నం కావడం, అదే వృక్షం కింద నరసింహస్వామి విగ్రహం లభించడంతో మరికొంత మంది భక్తులు నరసింహస్వామి స్వరూపంగా ఆరాధిస్తున్నారు. ఆలయంలో వీరభద్ర స్వామి, నరసింహ స్వామి విగ్రహాలను ఉంచి రెండు సంప్రదాయాల్లో పూజలు నిర్వహిస్తున్నారు.

ప్రతి ఇంట్లో స్వామి నామమే

స్వామి ఆశ్రమం పొందిన గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లోని ఏఇంటికి వెళ్లినా స్వామి నామమే వినిపిస్తుంది. ఈరన్న, ఈరమ్మ, నాగరాజు, నాగమ్మ, వీరేష్, వీరన్న ఇలా పేర్లు వినిపిస్తాయి. తమ పిల్లలకు స్వామి పేర్లు పెట్టడం వల్ల ఇంటికి అంతా శుభం జరుగుతుందని భక్తులు భావిస్తున్నారు.

ఏర్పాట్లు ఇలా..

ఉత్సవాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి దర్శనానికి ఇబ్బంది లేకుండా బారికేడ్లు నిర్మిస్తున్నారు. ట్రాఫిక్ స్తంభించకుండా ఆలయానికి నాలుగు వైపులా కిలోమీటర్ దూరంలోనే వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ దీపాలతో రాజగోపురాలను అలంకరించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదోని, ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోల నుంచే కాకుండా కర్ణాటకలోని బళ్లారి, శిరుగుప్ప, రాయచూరు, సింధనూరు డిపోల నుంచి ఉరుకుందకు బస్సులు నడుపనున్నారు. ఆలయం వద్ద నిత్యాన్నదానం కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమం నిర్వహణకు ప్రత్యేక భవనాన్ని విశాలమైన ప్రదేశంలో నిర్మించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

పాములపాడు: కర్నూలు – గుంటూరు జాతీయ రహదారిపై యర్రగూడూరు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వెలుగోడు మండలం గుంతకందాల గ్రామానికి నాగేంద్రగౌడు (26) ఆదివారం కంబాలపల్లి గ్రామంలోని తన పెదనాన్న సుబ్బరాయుడు వద్దకు బైక్‌పై వెళ్లాడు. అక్కడి నుంచి పెదనాన్నతో స్వగ్రామానికి బైక్‌పై బయలేద్దారుడు. మార్గమధ్యలో యర్రగూడూరు సమీపంలో బహిర్భూమి వెళ్లేందుకు బైక్ నిలిపాడు. ఆ సమయంలో కర్ణాటక రాష్ట్రం బెల్గాంకు చెందిన లింగప్ప శ్రీశైలం వెళ్లి కారులో తిరిగి వస్తూ బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగేంద్రగౌడ్‌ను అదే కారులో పాములపాడు ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడికి రెండు సంవత్సరాల క్రితం భాగ్యతో వివాహమైంది. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రామేశ్వర్ తెలిపారు.

క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో యువకుడు మృతి



నక్క మహేంద్ర (ఫైల్)

బేతంచెర్ల: నంద్యాల జిల్లా బేతంచెర్ల పట్టణం సంజీవనగర్ కాలనీకి చెందిన యువకుడు నక్క మహేంద్ర (22) తోటి మిత్రులతో కలిసి క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నక్క తిమ్మప్ప, లక్ష్మీదేవి దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు మహేంద్ర (22) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కాలనీకి సమీపాన తోటి మిత్రులతో కలిసి మహేంద్ర క్రికెట్ ఆడుతూ గుండెలో నొప్పి వస్తుందంటూ కుప్ప కూలిపోయాడు. దీంతో తోటిమిత్రులు మహేంద్రను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఏకైక కుమారుడు గుండెపోటుతో మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

లంపీస్కిన్‌కు టీకాతో చెక్

- తెల్ల పశువులకు పొంచి ఉన్న ముద్ద చర్మ వ్యాధి ముప్పు
- గోట్‌ఫాక్స్ టీకాతో రక్షణ
- జిల్లా వ్యాప్తంగా 96 వేల టీకాల పంపిణీ లక్ష్యం
- డోన్, ప్యాపిలి, జూపాడుబంగ్లా, మిడ్తూరు మండలాల్లో అధిక వ్యాప్తి

నంద్యాల(సెంట్రల్): పశువుల్లో వచ్చే సాంక్రమిక వ్యాధుల్లో ఇప్పటివరకు అధికశాతం నివారించదగ్గ జాబితాలోనే ఉన్నాయి. వ్యాధి రాకమునుపు టీకాలతో, సంక్రమించిన తర్వాత వైద్యులు సిఫారసు చేసిన మందులతో పలు రకాల రుగ్మతల్ని పశుపోషకులు కట్టడి చేస్తూ వస్తున్నారు. కానీ రెండేళ్ల క్రితం జిల్లాలోని మూగజీవాలకు వ్యాపించిన లంపీస్కిన్ (ముద్దచర్మవ్యాధి) ప్రాణాంతకంగా మారింది. ఏటా పశుసంతతిని ఈ మహమ్మారి కబళించటంతో పాటు బతికున్న వాటిని జీవచ్ఛవాలుగా మారుస్తోంది. ఎక్కువగా తెల్లజాతి పశువులైన ఎద్దులు, ఆవులకు ఇది సోకి అపార నష్టాన్ని మిగుల్చుతోంది. ఈ వ్యాధి నివారణకు ఇప్పటి వరకు కచ్చితమైన టీకా ఏదీ కనుగొనలేదు. మొదట్లో వ్యాధి తీవ్రతను బట్టి సాధారణ చికిత్సను అందించి పశువులను కాపాడేవారు. కానీ గోట్‌ఫాక్స్ టీకా సమర్థవంతంగా పనిచేస్తోందని పశుసంవర్ధక శాఖ గుర్తించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టి వ్యాధిని అదుపులోకి తెచ్చింది. 2018 పశుగణన ప్రకారం జిల్లాలోని రెండు డివిజన్ల (నంద్యాల, ఆళ్లగడ్డ) పరిధిలో 16,02,698 సంఖ్యలో పశుసంపద ఉంది. ఇందులో తెల్లజాతి పశువులైన ఎద్దులు, ఆవులు 1,20,565 ఉండగా, నల్లజాతి పశువులైన బర్రెలు, దున్నలు 293830 ఉన్నాయి. ముఖ్యంగా జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, ఓర్వకల్లు జూపాడుబంగ్లా, మిడ్తూరు తదితర మండలాల్లో గత నాలుగేళ్లుగా ఎక్కువ కేసులు నమోదు కావటంతో పాటు పదుల సంఖ్యలో పశువుల మరణాలు సంభవిస్తున్నాయి. దీనికి కారణం ఈ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు ఎక్కువగా ఎద్దుల్ని ఉపయోగించటం, ఆవుల పెంపకానికి అనుకూలంగా ఉండటంతో తెల్లజాతి పశువుల సంఖ్య ఎక్కువగా ఉంది. గతేడాది జిల్లా వ్యాప్తంగా 55 మూగజీవాలు ఈ వ్యాధి బారిన పడి చనిపోయాయి. ఈ వ్యాధికి గోట్‌ఫాక్స్ టీకా సమర్థవంతంగా చేస్తుండటంతో పశు సంపదను కాపాడేందుకు అధికారులు రంగంలోకి దిగారు. ఈ ఏడాది 96 వేల దాకా టీకాలు వేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా ఇప్పటి వరకు 26 వేల టీకాలు వేశారు. గ్రామీణ ప్రాంతాల్లో టీకా కార్యక్రమం చురుగ్గా సాగుతోంది.



లంపీస్కిన్ వ్యాధి సోకిన పశువు

ఇంటి పట్టునే చికిత్స

జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ రైతులకు ఇంటిపట్టున దొరికే సంప్రదాయ దినుసులతో కూడిన ఆయుర్వేద చికిత్సా పద్ధతులను రైతులకు అందుబాటులోకి తెచ్చింది.

- తమలపాకులు 10, మిరియాలు 10 గ్రాములు, ఉప్పు 10 గ్రాములను దంచి లేపనం లాగా తయారు చేయాలి. ఈ లేపనానికి తగినంత బెల్లం కలిపి పశువుకు తినిపించాలి. మొదటి రోజున ఇలా తాజాగా తయారు చేసిన ఒక మోతాదు మందును ప్రతి 3 గంటలకొకసారి పశువుకు తినిపించాలి. రెండో రోజు నుంచి రెండు వారాల పాటు రోజుకు 3 సార్లు (ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం) తాజాగా తయారు చేసిన మందును తినిపించాలి.

వర్షాకాలం వ్యాప్తి అధికం


లంపీస్కిన్ వ్యాధి ఏడాది పొడవునా ఎప్పుడైనా రావటానికి ఆస్కారం ఉంది. పశువుల్లో కాప్రిపాక్స్ వైరస్ కారణంగా లంపీ స్కిన్ వ్యాధి సంభవిస్తుంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పాకల చుట్టూ నిలిచిన నీరు, మురుగు కాల్వల్లో దోమలు, పురుగుల తాకిడి అధికంగా ఉంటుంది. దీంతో వ్యాధి వ్యాప్తికి ఎక్కువ ఆస్కారం ఉంటుంది.



గోస్పాడు మండలం జిల్లెల్లలో ముద్దచర్మ వ్యాధి నివారణలో భాగంగా టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

- వెల్లుల్లి 2 పాయలు, ధనియాలు పది గ్రాములు, జీలకర్ర పది గ్రాములు, తులసి ఆకులు గుప్పెడు, బిరియానీ ఆకులు పది గ్రాములు, మిరియాలు 10 గ్రాములు, తమలపాకులు 5, ఉల్లిపాయలు చిన్నవి రెండు, పసుపు 10 గ్రాములు, నేలవేము ఆకుల పొడి 30 గ్రాములు, కృష్ణ తులసి ఆకులు గుప్పెడు, వేపాకులు ఒక గుప్పెడు, నేరేడు ఆకులు ఒక గుప్పెడు...ఇంకా బెల్లం వంద గ్రాములు. ఈ మందును ప్రతి సారీ తాజాగా తయారు చేయాలి. అన్నింటినీ కలిపి దంచి లేపనంలా చేసి, దానిలో బెల్లం కలపాలి. మొదటి రోజు ప్రతి 3 గంటలకొకసారి తాజా మందు తయారు చేసి పశువుకు తినిపించాలి. రెండో రోజు నుంచి ప్రతిరోజూ మందును తాజాగా తయారు చేసి రోజుకు రెండుసార్ల చొప్పున పొద్దున, సాయంత్రం పశువు స్థితి మెరుగుపడే వరకు తినిపించాలి.
- లంపీ చర్మం జబ్బు సోకిన పశువు చర్మంపై గాయం ఉంటే, అందుకోసం ప్రత్యేకంగా సంప్రదాయ పద్ధతిలో మందు తయారు చేసి పైపూతగా రాయాలి. కుప్పింటాకులు ఒక గుప్పెడు, వెల్లుల్లి పది రెబ్బలు, వేపాకులు ఒక గుప్పెడు, కొబ్బరి లేదా నువ్వుల నూనె 500 మిల్లీ లీటర్లు, పసుపు 20 గ్రాములు, గోరింటాకు ఒక గుప్పెడు, తులసి ఆకులు ఒక గుప్పెడు తీసుకుని మిక్సీలో వేసి రుబ్బి పేస్టులా తయారీ చేసుకోవాలి. గాయాలన్ని శుభ్రపరచి దాని మీద ఈ మందును రాయాలి. గాయం మీద పురుగులు ఉన్నట్లయితే..సీతాఫలం ఆకుల పేస్ట్ లేదా కర్పూరం, కొబ్బరినూనె కలిపి రాయాలి.

ఈ వ్యాధికి జూనోటిక్ లక్షణం లేదు




జిల్లా వ్యాప్తంగా లంపీ స్కిన్ వైరస్ నియంత్రణలో ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వ్యాధి లక్షణాలు గుర్తిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదిస్తే తగిన చికిత్స అందిస్తారు. ఈ వైరస్ కారణంగా మనుషులకు ఎలాంటి ఇబ్బంది లేదు. దీనికి జూనోటిక్ లక్షణం లేదు కనుక ఎట్టి పరిస్థితుల్లోనూ మనుషులకు సోకే అవకాశం లేదు. వ్యాధి రాక మునుపే టీకా వేయిస్తే ఏ సమస్యా ఉండదు. ఈ సంవత్సరం 96 వేల దాకా టీకాలు వేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఇప్పటి వరకు 26 వేల దాకా పూర్తి చేశాం.

– డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి, నంద్యాల జిల్లా

నేడు అభివృద్ధిపై సమీక్ష

కర్నూలు(సెంట్రల్): మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్ష సమావేశాన్ని సోమవారం ఎమ్మిగనూరు మునిసిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సీపీఓ జేడీ ఎల్ అప్పలకొండ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రెండు నియోజకవర్గాల్లోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. ఈ సమావేశానికి ఇన్‌చార్జిమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కార్మిక ఉపాధి కల్పన శాఖమంత్రి గుమ్మనూరు జయరాం, స్థానిక శాసనసభ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

శ్రీశైలం డ్యాం నీటి మట్టం 863.80 అడుగులు



శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం లేకపోయినప్పటికీ దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో డ్యామ్‌లో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. శనివారం నుంచి ఆదివారం వరకు ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 6.552 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి 10,757 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 12 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇన్‌ఫ్లో లేనప్పటికీ 25,157 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 118.3380 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, డ్యామ్ నీటిమట్టం 863.80 అడుగులకు చేరుకుంది.

ఇద్దరి ప్రాణాలను కాపాడిన మెరైన్ పోలీసులు

చీరాల టౌన్: స్నేహితులతో సరదాగా గడిపేందుకు కర్నూలు నుంచి వాడరేవుకు వచ్చిన మిత్ర బృందంలో ఇద్దరు యువకులు అలల తాకిడికి గురై సముద్రంలో కొట్టుకుపోతుండగా మెరైన్ పోలీసులు తమ ప్రాణాలకు తెగించి యువకుడి ప్రాణాలను కాపాడారు. ఈఘటన ఆదివారం రామాపురం సముద్రతీరంలో చోటు చేసుకుంది. మెరైన్ ఎస్సై పసుపులేటి సుబ్బారావు వివరాల మేరకు.. రామాపురంలోని ఓ రిసార్ట్ సమీపంలో కర్నూలు నుంచి సముద్ర తీర ప్రాంతానికి ఐదుగురు వచ్చారు. మిత్ర బృందంలో పుల్లేటి మహేష్, గోగుల రమణ సముద్రంలో స్నానాలు చేస్తుండగా అలల తాకిడికి గురై సముద్రంలో కొట్టుకుపోతుండగా తీరం ఒడ్డున విధులు నిర్వహిస్తున్న మెరైన్ పోలీస్ కానిస్టేబుల్ (పీసీ 3562) గణేష్ తన ప్రాణాలకు తెగించి అలల తాకిడికి గురైన యువకుడిని రక్షించి ప్రాణాలతో కాపాడాడు. అలానే కానిస్టేబుల్ పీసీ 1253 ఎం.వెంకటేశ్వర్లు ఇరువురు యువకులను కాపాడి ప్రాథమిక చికిత్స అందించారు. సెలవు రోజుల్లో వాడరేవు, రామాపురం సముద్ర తీర ప్రాంతాలకు పర్యాటకులు అధికంగా వస్తున్నందున మెరైన్, సివిల్ పోలీసులు విధిగా బందోబస్తు నిర్వహిస్తున్నారు. పోలీసులు సకాలంలో స్పందించపోతే రెండు ప్రాణాలు సముద్రంలో కలిసిపోయేవని, తమ ప్రాణాలకు కాపాడిన కానిస్టేబుల్ గణేష్, వెంకటేశ్వర్లుతో పాటు మెరైన్ సిబ్బందికి స్నేహితుల బృందం కృతజ్ఞతలు తెలిపింది. సకాలంలో స్పందించిన మెరైన్ పోలీసుల తీరును పర్యాటకులు హర్షించారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి



మృతి చెందిన రాగిమాన్‌దొడ్డి కుమ్మరి సోమన్న

మంత్రాలయం: పెద్దకడబూరు మండలం హనుమాపురం గ్రామ సమీపంలోని ఆదోని–ఎమ్మిగనూరు రహదారిలో ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపారు. ఆటోకు అడ్డుగా కుక్క రావడంతో డ్రైవర్ అదుపు చేయలేకపోయాడు. దీంతో ఆటో ఒక్కసారిగా బోల్తా పడింది. ఆటోలో ప్రయాణం చేస్తున్న పెద్దకడబూరు మండలం రాగిమాన్‌దొడ్డికి చెందిన కుమ్మరి సోమన్న (61) మృత్యువాత పడ్డాడు. ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. అనుకోకుండా సోమన్న మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు విలపించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీబీ డ్యాం సమాచారం



పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,622.70
టీఎంసీల సామర్థ్యం	: 105,788
ప్రస్తుతం	: 89,261
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 11,987
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 11,546

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు శుభవార్త

247 పోస్టులు మంజూరు చేసిన ప్రభుత్వం

- పలు విభాగాలు, బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు
- వైద్యులు, సిబ్బంది నియామకం



ఆసుపత్రిలో నిర్మిస్తున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో నిర్మిస్తున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆసుపత్రికి 247 పోస్టులు మంజూరు చేస్తూ తాజాగా ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జీఓ 121 విడుదలైంది. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ కంట్రోల్ ఆఫ్ క్యాన్సర్, డయాబెటీస్, కార్డియో వాస్కులర్ అండ్ స్ట్రోక్(ఎన్‌పీసీడీసీఎస్) ప్రోగ్రామ్ కింద స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 2012–2019 పంచవర్ష ప్రణాళికలో చేర్చింది. ఈ మేరకు రూ.90కోట్లను మంజూరు చేసింది. అయితే ఈ మొత్తంలో 60శాతం నిధులు కేంద్రం, 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.54కోట్లను, రాష్ట్ర ప్రభుత్వం రూ.36కోట్లను విడుదల చేశాయి. నిర్మాణానికి సాంకేతిక సహకారం కోసం టాటా ట్రస్ట్‌తో 2017 జూన్‌లో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సంస్థకు ముంబయి, కోల్‌కతా, అహ్మదాబాద్‌లలో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి.

కర్నూలును గుర్తుకు తెచ్చేలా.. కే ఆకారం

ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను కర్నూలు పేరులోని మొదటి అక్షరం కే వచ్చేలా నిర్మాణం చేశారు. దూరదృష్టితో జీ ప్లస్–2 కింద భవనాన్ని డిజైన్ చేసినా, ప్రస్తుతం జీ ప్లస్ వన్ ప్రణాళికతో 1.5 ఎకరాల విస్తీర్ణంలో 120 పడకలతో నిర్మాణం పూర్తి చేస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 58వేల చదరపు అడుగులు, మొదటి అంతస్తులో 58వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం కొనసాగుతోంది.

సీమ ప్రజలకు వరం



స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పూర్తయితే రాయలసీమ వాసులకు వరంగా మారుతుంది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు సైతం ఈ ఆసుపత్రి ఎంతో ఉపయోగం. చాలా మంది ప్రజలు ప్రస్తుతం మెరుగైన క్యాన్సర్ వైద్యం కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారు. వీరంతా కర్నూలులోనే మెరుగైన వైద్యం అందుకునే అవకాశం లభిస్తుంది.

–డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటారు



ఎంతో అధునాతనమైన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 247 పోస్టులు మంజూరు చేయడం ఎంతో ఆనందించదగ్గ విషయం. దీంతో చాలా మంది వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, నర్సులు, నాల్గవ తరగతి సిబ్బంది పోస్టులు భర్తీ అవుతాయి. కొన్ని వందల కుటుంబాలకు తద్వారా ఉపాధి లభిస్తుంది. రోగులు, వారి కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటారు.

–డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

రెండు ట్రాక్టర్లు, లారీ పట్టివేత

కర్నూలు (న్యూసిటీ): అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లలో బండలు, లారీలో నాపరాయి తలిస్తుండగా పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం రాత్రి బేతంచెర్లలో కలర్, నల్ల బండలు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, నంద్యాలలో నాపరాయిని తీసుకెళ్తున్న లారీని అధికారులు స్వాధీన పరుచుకున్నారని ఆదివారం ఒక ప్రకటనలో డీడీ రాజశేఖర్ పేర్కొన్నారు. పట్టుకున్న వాహనాల్లో కలర్ బండల ట్రాక్టర్‌కు రూ.7500, నల్ల బండల ట్రాక్టర్‌కు రూ.6000 జరిమానా విధించామని ఆయన చెప్పారు. నాపరాయి తీసుకెళ్తున్న లారీ యజమానికి రూ.20 వేలు అపరాధ రుసుం విధించి ఆ లారీని రక్షణ నిమిత్తం నంద్యాల ఆర్టీసీ డిపోలో ఉంచామని తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం తలమంచిపట్నం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గతేడాది డిసెంబరు 12న హుండీ పగులగొట్టి రూ.5 వేల నగదు తీసుకెళ్లారు. ఈ సంఘటనలో కర్నూలు జిల్లాకు చెందిన బోయ హరికృష్ణ, పుల్లయ్యను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గోపీనాథ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. అలాగే తాళ్ల ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, వల్లూరు తదితర ప్రాంతాల్లో ఒక వెండి కిరీటం, కొంత మేరకు బంగారు చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో నిందితులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

త్వరలో ఆదోనిలో కురువ సింహ గర్జన

- హాజరు కానున్న కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య
- కురుమ, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు



మాట్లాడుతున్న జబ్బల శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): రాజకీయ చైతన్యమే లక్ష్యంగా త్వరలో ఆదోనిలో లక్ష మందితో కురువ సింహ గర్జనను నిర్వహిస్తున్నట్లు కురువ, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. ఈ గర్జనకు కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య హాజరువుతున్నట్లు తెలిపారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప, బల్లారి మాజీ మేయర్ శశికళ మోహన్, యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే రామకృష్ణ, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కోఆర్డినేటర్ జోషి రాఘవేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కర్నూలు జిల్లాలో కురువ కులస్థులకు ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్యే స్థానాలను కేటాయించాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి కురువల్లో ఐక్యతను తీసుకువచ్చేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మద్దిలేటి, ప్రచార కార్యదర్శిగా డీ రఘురాం, యువజన సంఘం జిల్లా అధ్యక్షులుగా భానుప్రకాష్, ఉపాధ్యక్షులుగా బీరప్ప, ప్రధాన కార్యదర్శిగా గడ్డం రామాంజనేయులు, నంద్యాల జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా మానుపాటి శ్రీనివాసగౌడను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి చలపతి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రవిశంకర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి అనంతపురం విఠల్‌గౌడ్, నాయకులు వెంకటరాముడు, నాగలాపురం యుగంధర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక చైతన్యం

- రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం
- ముఖ్య అతిథిగా హాజరైన రజక వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న



ప్రతిభా పురస్కారాన్ని అందిస్తున్న రజక నేతలు

కర్నూలు(అర్బన్): విద్య ద్వారానే సామాజిక చైతన్యం లభిస్తుందని రజక వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పాతపాటి అంజిబాబు అన్నారు. ఆదివారం నగరంలోని ఓ కళాశాలలో రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. వేదిక గౌరవాధ్యక్షులు సీపీ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రజక ఐక్య సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంరాంబాబు, కార్యదర్శి వాడాల నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల క్రితం వరకు రజకులు పేదరికంలో కుల వృత్తినే నమ్ముకొని దుర్భరమైన జీవితాలను గడుపుతు వచ్చారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రజకుల్లో కూడా చైతన్యం రావడంతో తమ పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్య ద్వారానే జీవితాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, ఆ దిశగా రజక కుటుంబాలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన 45 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. నాయకులు గోల్డ్‌మెన్ శ్రీను, కేతూరు మధు, జిల్లెళ్ల శ్రీరాములు, రాయపాటి గోపాల్, మాలంగిరి గణేష్, గిరిధర్‌కుమార్, గురుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


తండ్రి మందలించాడని ఆత్మహత్య

డోన్ టౌన్: కళాశాలకు ఎందుకు వెళ్లడం లేదని తండ్రి మందలించడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కొత్తబురుజు గ్రామానికి చెందిన బాలరాజు కుమారుడు వడ్డే వెంకటేశ్వర్లు(18) పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నాడు. అయితే కళాశాలకు సక్రమంగా వెళ్లక పోవడం, పొలం పనులకు రాకుండా గ్రామంలో తిరుగుతుండటంతో కూమారుడిని తండ్రి మందలించాడు. దీంతో ఈనెల 11వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. మృతునికి తల్లిదండ్రులతో పాటు ముగ్గురు సోదరులు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

మంత్రాలయం రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చెట్నేహళ్లి గ్రామానికి చెందిన బెస్త బజారప్ప(77) మృతిచెందాడు. గ్రామ శివారులో బజారప్ప కుటుంబ సభ్యులు ఫిల్టర్ వాటర్ ప్లాంటును నిర్వహిస్తున్నారు. రోజు రాత్రి అక్కడే బజారప్ప నిదురించేవాడు. రోజు మాదిరిగానే మరుగుదొడ్డికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆయన మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ పరిశీలించి కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని మహిళకు తీవ్ర గాయాలు



గాయపడిన మహిళ

కర్నూలు (టౌన్): నగరంలోని ఆటోనగర్ సమీపంలో హుందాయ్ షోరూమ్ ఎదురుగా నేషనల్ హైవే సర్వీస్ రోడ్డు ఓ గుర్తు తెలియని మహిళ తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోయి పడి ఉంది. స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళ రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు గుర్తించారు. ఆమె చిరునామా తెలియకపోవడంతో 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలిసిన వారు సీఐ 9121101062 సెల్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.